# భామా కలాపం

" మంగా...మంగీ..ముంగిలా మట్లాడవేమే...ఏ మూలన వున్నావ్...?"

" నా పేరు మంగళ...మంగీ, ముంగీ అని పిలిస్తే నేను పలకను..! "

" నువ్వు పలకవైతే నేను బలపాన్ని ! ఒట్టి పలకతో ప్రయోజనం ఏం వుందీ ! అయినా పలకల కాలం ఎపుడో చెల్లిపోయిందే...! "

"అత్తల పెత్తనానికీ కాలం చెల్లిపోయిందిలే...ఇపుడు నడుస్తోంది కోడళ్ళ రాజ్యం..! "

" ఎలా పిలవాలో కూడా నువ్వే చెబుతున్నావ్ ! గుడ్డొచ్చి పిల్లను ఎక్కిరించటమంటే ఇదే...! పేరంతా పెట్టి పిలవక్కరలేదు. పొట్టిగా ముద్దు పేరుతోనే పిలుస్తారు...తెలుసా....? "

" గుడ్డు వెక్కిరిస్తోందనుకునేకంటే...పిల్లల మాటల్లోనూ సబబు ఉందేమోనని ఆలోచించటం మంచిది కదూ....అయినా ముద్దు పేరని అంటున్నావుగానీ, ముద్దుగా ఉండనక్కరలేదా...? నీ పేరు భాగ్యలక్ష్మి అయినా అందరూ భాగ్యం అనేగా పిలుస్తారూ....భాగీ, మ్యాగీ అని పిలిస్తే బావుంటుందా...? "

" మాటకి మాట చెప్పటం బాగా వచ్చు. మాటలు నేర్చిన కుక్క 'ఇస్కో' అంటే 'ఇస్కో' అందట ! "

" కుక్క మాట్లాడింది అంటేనే అది గొప్ప విషయం. అందుకు మెచ్చుకోకుండా ఏదో అందని వంకలు ఎందుకూ...ఏది నేర్పిస్తే అదే వస్తుంది ! "

" ఈ చిలకపలుకులు కేం గానీ, చింత లేనమ్మ సంతలోనూ నిద్ర పోయినట్లు... పని వేళ పక్క ఎక్కి పుస్తకాలు తిరగేస్తున్నావేంటీ కత...? "

" పిల్లలకి నాలుగు అక్షరాలు నేర్పించాలంటే, నాకూ గుర్తుండాలి గా అందుకని..."

" ఏటేటీ ...పిల్లలకు చదువు చెప్పే పంతులమ్మవి అయిపోదామనే? ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగురుతానన్నట్లు ఉంది ! బాగా చదువుకుంటే, ఉద్యోగం చేయొచ్చని చెవినిల్లు కట్టుకున్నట్లు పోరు పెట్టి చెప్పినా విన్నావా...? పదో తరగతే గట్టెక్కలేక తప్పి కూర్చున్నావ్...! "

“ నష్టమేం లేదులే....ఉట్టి క్రింద నట్టింట్లోనే నా స్వర్గం ఉన్నపుడు పైకి ఎగరాల్సిన అవసరమేం ఉందీ...! అయినా నీవలనేగా నేను కష్టపడి మరీ పరీక్ష తప్పాల్సివచ్చింది ! తెలిసిన జవాబులు రాయకుండా ఉండటం ఎంత కష్టమో నీకేం తెలుసూ....! ”

“ వంక లేనమ్మ డొంక పట్టుకుని ఏడ్చిందన్నట్లు...మధ్యలో నేనేం చేశానూ...? “

“ దర్జాగా ఉద్యోగం చేస్తుందీ, బాగా చదివించూ అని మా నాన్నకు చెబుతూనే, నీ కొడుక్కి పెళ్ళి సంబంధాలు చూడటం మొదలు పెట్టావా, లేదా...?”

“ అయితే....బోడిగుండుకీ, మోకాలికీ ముడిపెట్టినట్లు దానికీ, దీనికీ ఏంటే సంబంధం...? “

“ మనసులో ఉన్నవాడికి పెళ్ళి ఏర్పాట్లు జరిగిపోతుంటే....నిమ్మకు నీరెత్తినట్లుగా పట్టించుకోకుండా ఎలా ఉండగలనూ...? “

“ అంటే...ఏమిటే..? అలా అరకొరగా చెబితే నాకేం అర్ధమౌతుందీ...? “

“ ఏం ఉందీ, పరీక్ష తప్పాను కాబట్టే, మా నాన్న పై చదువుల ఆశ వదిలేసి పెళ్ళిసంబంధాలు చూడటం మొదలు పెట్టాడు. అపుడయినా నువ్వు బయట పడకుండా బెట్టు చూపిస్తుంటే, నేనే చివరికి మా నాన్న దగ్గర నా మనసు గుట్టు విప్పాల్సి వచ్చింది ! “

“ ఓసినీ...తెలివి తెల్లారినట్లే ఉంది ! ఉపాయముంటే ఊళ్ళేలవచ్చన్నారు ! నువ్వేమో చదువును చెట్టెక్కించటానికి ఇలాంటి పన్నాగం చేశావా..?! హవ్వ...! “

“ అవును...అవ్వా, బువ్వా కావలంటే కుదరదని, చదువుని వదిలేయాల్సి వచ్చింది ! మా గురించి తెలిసీ, మా నాన్న దగ్గర పెళ్ళి గురించి మాట సాయం అయినా చేయలేదుగా..! “

“ నేనే మీ నాన్నని అడిగివుంటే, ఆకాశానికి నిచ్చెన వేసే ఆశపోతు వ్యవహారంలా ఉండేది కాదా...! రెక్కాడితేగానీ, డొక్కాడని బతుకులు మావి. నాలుగు తరాలపాటు దర్జాగా కూర్చుని తిన్నా తరగనంత ఆస్తిపాస్తులున్న స్థితిమంతుడు మీ నాన్న...అవునా..? “

“ ఆడదానికి తన మనసు గెలుచుకున్నోడే మారాజుగానీ, మడులూ మాన్యాలూ ఉన్నోడు కాదని నీకు మాత్రం తెలియదా...? “

“తెలిస్తే మాత్రం, ఎలా తెగించగలనూ...! మీ నాన్న నాకు స్వంత అన్న కాకపోయినా ఏదో బీరకాయ పీచు బంధుత్వం ఉన్నందునో లేక చిన్నప్పటినుండీ ఒకే వూరిలో ఉంటున్నామనే మమకారంతోనో గానీ, స్వంత

అన్న కంటే మిన్నగా అన్ని అవసరాల్లో కొండంత అండగా నిలబడే వాడు...అలాంటి మీ నాన్నతో వియ్యమందాలనుకోవటం....పున్నానికి పెట్టినమ్మను నీ మొగుడితో సమానంగా పెట్టమని అడిగినట్లుండదా...? ఏదో చిన్నప్పటి సావాసంతో మనసు పడ్డావుగానీ, మా ఇంటిలో ఇమడటం కష్టం అనిపించి, మీ పెళ్ళికి నేనే అడ్డం పడాలనుకున్నాను కూడా ! "

" నిజమా...ఎందుకనీ...నేను నచ్చలేదా..? "

" కాదు...కట్నం మీద కోరిక పుట్టి...."

" మా నాన్న ఇవ్వలేనివాడు కాదు కాబట్టి, ఆ మాట నమ్మదగ్గది కాదు. అసలు విషయం చెప్పు...అందచందాలలో నీ కొడుక్కి సమ ఉజ్జీ కాదనిపించిందేమో...అవునా...? "

" మరీ అంత బడాయి పనికిరాదు ! ఆ మాట నానోటనే కాదు, ఈ వూరి మొత్తం మీద ఎవరూ అనలేరు ! కయ్యానికైనా, వియ్యానికైనా సమాన స్థాయి ఉండాలని పెద్దవాళ్ళు అన్నారా....పుత్తడి బొమ్మ లాంటి నువ్వు ధగధగలాడే మహల్లో ఉండాలిగానీ, మాలాంటివాళ్ళ మాములు కొంపల్లో కాదనిపించింది..! "

" అందుకని...? "

" ఏముందీ...మీ నాన్న ' చెల్లెమ్మా...ఉట్టి మీద వెన్న పెట్టుకుని నేతి కోసం ఊరంతా వెతుకుతున్నట్లైంది. ...నా కూతురు నీ కొడుకునే పెళ్ళి చేసుకుంటానంటోంది !' అని నోరారా నవ్వుతూ అనేసరికి నాకు ఆనందం లోపలినుండి తన్నుకు వచ్చినా తమాయించుకున్నాను ! చిన్న పిల్ల...అమాయకంగా అడిగితే మాత్రం ...మంచీ చెడ్డా వివరించి అలాంటి కోరిక తగదని నచ్చచెప్పాల్సిందిపోయి....వెంటనే ఒప్పేసుకోవటమేమిటనిపించిందే...! నింద నా మీదేసుకుని, ఆ పనేదో నేనే చేద్దామని....' నీకున్న ఆస్తిపాస్తులబట్టీ, ఒక్కతే కూతురని కట్నం అడగకుండా, గొప్ప గొప్ప సంబంధాలు చాలానే వస్తాయి ! నాకేమో కట్నం మీద ఆశ చాలానే వుంది ! నా చేతుల్లో ఇప్పటికిప్పుడే డబ్బు పెట్టే సంబంధం చూసుకుంటాం ...మనం వియ్యమందటానికి వీలుండదులే ' అన్నాను. అలా చెప్పటానికి మనసును కూడగట్టుకోవటానికి ఎంత కష్టపడ్డానో...నీకేం తెలుసూ...! "

" తెలుసులే...ఆమాట నువ్వన్నపుడు..నాకూ కోపం కట్టలు తెంచుకువచ్చేసింది.."

" నీకెలా తెలుసూ...మీ నాన్న చెప్పాడా..?"

" పెళ్ళి మాటలు జరుగుతాయని తెలిసి, నేను తలుపు వెనకాలే నిలబడ్డాను. నీ మాటలకి మా నాన్న ఏ మాత్రం కోపం తెచ్చుకోకుండా, ' ఎవరైనా పేద పిల్లలకి కట్నం డబ్బు సర్దుబాటు చేస్తానని మాట

ఇచ్చావామ్మా...? ' అని అడిగాడు కదూ..? అదేంటని నువ్వు ఆశ్చర్యపోతుంటే, ' నీకు డబ్బాశ ఉందంటే, నేనెలా నమ్ముతానమ్మా...నీ సంగతి నాకు తెలియకపోతేగదా..! ' అన్నాడు. అంతేగా..."

" అవును..అంతేనే ! చల్లగాలి తగలగానే నల్లమబ్బు కరిగి కురిసినట్లుగా....ఆ మాటకి నా మనసు కదిలిపోయింది...కన్నీళ్ళు కాల్వలు కట్టాయి...!"

" మా నాన్న చేతులు పట్టుకుని ' ఎంత గొప్ప మనసన్నయ్యా నీది..' అంటూ నువ్వు వలవలా ఏడిస్తే...'ఇంత మంచి అత్తనెంతలా అపార్థం చేసుకున్నానూ..' అని లోలోన నేనూ కన్నీళ్ళు కార్చాను ! నీకు తెలుసో లేదో తెలియదుగానీ, మా నాన్న చాలా తెలివిగలవాడు కూడానత్తా..! ఆ తర్వాత నేను మా నాన్నతో 'ఆస్తిపాస్తుల అంతరం లెక్కేసి కాదంటావేమోనని భయపడ్డాను నాన్నా...' అంటే ఏమన్నాడో తెలుసా...? ' పెద్దవాళ్ళిచ్చిన సంపద...సమర్థత లేకపోతే, కరిగిపోవటనికి ఎంతో కాలం పట్టకపోవచ్చునుగానీ, కష్టపడే తత్త్వం ఉన్నవాడు స్వశక్తి తోనే ఎదగగలడని నాకు నమ్మకం ఉందీ..!' బావని ఎంత బాగా అంచనా వేశాడో చూశావా..! "

" అవును..హలంలోనే ఐశ్వర్యముందంటారు. మీ నాన్న ఆ మాటను నమ్మటమేకాదు, ఆచరణలోనూ పెట్టాడు ! లేకపోతే ఏమిటి...కలకత్తా వరకూ వెళ్ళయినా గాలించి, కలెక్టరు అల్లుడిని తెచ్చుకుంటాననేవాడు కాస్తా...పొలంలో కష్టపడే, నా కొడుక్కి నిన్నప్పగించటానికి ఒప్పుకున్నాడంటే...అర్థం అదేగా మరీ...! "

" ఇంకా వుంది విను...తల్లి లేని లోటును ఎంతటి ఐశ్వర్యమైనా పూరించలేదట ! అమ్మలా ఆదరించే అత్త వున్న ఇల్లు అష్టైశ్వర్యాలతో తులతూగుతున్నట్లే ఆనందాన్ని కలిగిస్తుందట ! ఈ మాటల్ని చెబుతూ మా నాన్న ఒక సంఘటనా చెప్పాడు. నా చిన్నప్పుడు..నువ్వు నన్నెత్తుకుని..నాకంటే ఏడాది చిన్నదైన కన్నకూతురు చిన్నిని చేయి పట్టుకుని నడిపిస్తూ తిరణాలలో తిరుగుతుంటే, చూసిన మా నాన్న ' ఇదేంటని ' అడిగితే....'తల్లి లేని పిల్ల అని మక్కువ ఎక్కువేమో తెలియదు....చూసిన వెంటనే దగ్గరకు తేసుకుని చంకనేసుకోవటం అలవాటయిపోయిందని ' నవ్వుతూ జవాబు చెప్పావట ! నీదంత మంచి మనసనే కాబోలు మా నాన్న నన్ను ఈ ఇంటి కోడలిగా పంపించటానికి ఆనందంగా ఒప్పుకున్నాడు..!"

" మంచితనాన్ని గుర్తించటం, గౌరవించటం...మీ నాన్నలాంటి గొప్ప మనసున్న వాళ్ళకే సాధ్యపడుతుంది ! అంతే కదూ..? "

"బావుంది సంబరం..! మీ అన్నాచెల్లెళ్ళు ఇద్దరికిద్దరూ బాగానే సరిపోయారు ! గొప్ప మనసు, మంచితనం..అంటూ ఒకరినొకరు బాగానే డప్పు కొట్టుకుంటున్నారు..! "

" తమ నలుపెరుగని గురివిందగింజల్లా తప్పుల్నే ఎత్తి చూపటం కాకుండా, సుగుణాల్నే ఎంచి మెచ్చుకోవటం మంచిపనేగా..! అయినా మా ఇద్దరి గొప్పతనం ఏంఉందిలే, అసలు సిసలు ఆణిముత్యానివి నువ్వే..! ' 'ఇది లేదు, అది కావాలీ అనకుండా ఉన్నదాంట్లోనే సర్దుకుపోగలుగుతున్నావ్ కాబట్టే, సుఖంగా జరిగిపోతోంది ! పుణ్యం కొద్దీ పురుషుడు...దానం కొద్దీ బిడ్డలని సామెత వుందిగానీ, నన్నడిగితే, నీలంటి కోడలు ఇంట్లో అడుగు పెట్టిందంటే..కోరకుండానే దేముడు కరుణించి వరమిచ్చినట్లనుకోవాలి...అవును కదూ..? !"

" మాటలతోనే మునగచెట్టెక్కించేస్తున్నావ్ గానీ, చేతల్లో మాత్రం....ఇంట్లోవాళ్ళకంటే నీకు వూళ్ళోవాళ్ళే ఎక్కువ...! "

" అదేంటే అలా అన్నావ్..? అయినవాళ్ళకి ఆకుల్లోనూ కానివాళ్ళకి కంచాల్లోనూ వడ్డించినట్లుగా నేనేంచేశానూ..? "

" సంవత్సరం అంతా కట్టిన చీటీల డబ్బు మొన్న చేతికి వచ్చినపుడు ' మనిద్దరికీ మంచికోకలు కొంటావా ?' అనడిగితే, కోకలే కాదు...అవి పెట్టుకోవటనికి మంచి రకం బీరువా కూడా కొంటానని చెప్పావా, లేదా..? నిన్నటికి నిన్న ' ఏకాదశి, ఉపవాసం..అన్నానికి రానూ, గుడిలో ప్రదక్షిణాలు చేస్తాననీ చెప్పి వెళ్ళినదానివి...గుట్టు చప్పుడు కాకుండా వచ్చి డబ్బంతా చెంగున కట్టుకుని వెళ్తోంటే, మంచిరోజని చెప్పా పెట్టకుండా, బీరువా కొని తెచ్చెయ్యాలని అనుకున్నావేమోనన్ని అనందంగా ఎదురుచూస్తుంటే, అచ్చియమ్మ వచ్చి నీ నిర్వాకం చెబితే, అప్పుడు అసలు విషయం తెలిసింది..! "

" అచ్చమ్మ, బుచ్చమ్మలనడగటం దేనికీ, నేను చెప్పనా...! కాలం, ఖర్మం కలిసి రాకపోతే, తాడే పామై కరుస్తుందన్నట్లు, రోడ్డు దాటుతూ రాంబాబు బోర్లా పడి కాలు విరగొట్టుకోవటం ఏమిటీ, ఆపరేషను అవసరం రావటం ఏమిటి చెప్పూ...! హాస్పిటల్ ఖర్చులకి చేతిలో చిల్లిగవ్వయినా లేదని వాడు కళ్ళ నీళ్ళెట్టుకుంటుంటే, అందరూ మాదీ అదే గతి అన్నట్లు చోద్యం చూస్తూ నిలబడ్డారుగానీ...సాయానికి ముందుకు రాలేదు..! "

" ఎందుకు వస్తారూ..అతగాడి సంగతి అందరికీ తెలియకపోతేగదా..! "

" ఎంగిలిచేత్తో కాకినయినా అదిలించని బాపతేననుకో..."

" అయినాసరే, నువ్వు మాత్రం సాయానికి ముందుకి ఉరికావ్...! ఎవరో దాయాది పోతే, ఒక ఎకరం కలిసి వచ్చినందుకే మన దగ్గిర ఎంత గీర చూపించాడూ...పొలం గట్టు దగ్గిరా, కాలవ నీళ్ళ కోసం తగవు పెట్టుకుని, అనవసరంగా నిన్ను ఎన్నెన్ని మాటలన్నాడో గుర్తు లేదా...? "

" అలాంటి వాళ్ళ కి సంపదలో మరపులు, ఆపదలో అరుపులు మామూలేలే !  మన పద్ధతి అది కాదు కదా ! కష్టంలో కన్నీళ్ళు పెట్టుకుంటుంటే, చిన్నప్పుడు అప్పా అంటూ ఆప్యాయంగా నా వెంట తిరిగే తమ్ముడే కనిపించాడుగానీ, తగవులాడే రాంబాబు కాదే ! పని చేసే పెద్ద మంచానపడితే, ఆ కుటుంబం గతి ఏమవుతుందోననిపించి, ఆ పైన నాకెందుకొచ్చిన బాధని చెప్పి...ఇంట్లో ఉన్న డబ్బుతో వాడి ఆపదకి అడ్డంపడి నేనూ స్థిమితపడ్డాను..! "

" మధ్యలో నీకు బాధేంటీ...నాకు అర్ధం కాలేదూ..? "

" దగ్గిర డబ్బు పెట్టుకునీ, అవసరానికి ఆదుకోలేకపోయానే అని లోపలనుండి మనసు  గిచ్చిగిల్లీ సాధిస్తోంటే...బాధ కాక  ఇంకేమిటి చెప్పు...ఆ డబ్బు సర్దుబాటు చేసి వచ్చాను కాబట్టే, కుదురుగా ప్రశాంతంగా వుండగలుగుతున్నాను ! అయినా రెండుచేతులా పుచ్చుకుంటున్నవాళ్ళం... ఒక చేతితో ఏంతో కొంత ఇతరులకి ఇవ్వాలిగదా...! "

" మనం ఎవరి దగ్గర్నుండి, ఏం పుచ్చుకుంటున్నాం....? "

"  జన్మ నిచ్చిన తల్లిదండ్రుల దగ్గర్నుండి మొదలు పెట్టి, చెట్టూ చేమా గొడ్డూ గోదా వరకూ ...ఇలా ఎన్నిటినుండో రకరకాలుగా ఏదో పుచ్చుకుంటుంటూనే వున్నాం ! అవునా..? అదిసరేగానీ, ఆ పరిస్థితి లో నువ్వయితే ఏం చేసేదానివో చెప్పు...? "

" .... .... .... "

" గొంతులో వెలక్కాయ పడ్డట్టు మాట్లాడలేకపోతున్నావేం...? నాకు తెలుసు...నువ్వయినా నేను చేసిందే చేస్తావు ! మనం అంతా ఒకే తానులోని ముక్కల్లాంటివాళ్ళం...! అవునా..? "

" ... .... ... "

" ముంగిలా మాట్లడవేమే..?ముంగి అంటే కోపం కాబోలు..పలకను..అంటావ్..! "

" కోపం కాదు ! మా నాన్నమ్మ పేరు ' మంగ ' అని నాన్న నాకా పేరు పెట్టబోతుంటే...నువ్వే మా నాన్నతో వాదన పెట్టుకుని ఒప్పించి ' మంగళ ' గా మార్చావని నాకూ తెలుసుగా..! ఇంగువ తాలింపు కూరకి ఘుమఘుమల్ని తెచ్చినట్లు మాటలకి సామెత జోడింపూ అంతేనట ! అందుకే పోట్లాడుతూనైనా నీతో మాటలు కలపటం నాకిష్టం...! ఆ ముచ్చట కోసమే..ఇలా..నీతో... అంతే...! "

“ నిజమేనే...అయినవాళ్ళతో మాటా మంతీ ఉంటేనే, మనసుకు కులాసా ! మంచీ చెడ్డా పంచుకుంటేనే బ్రతుక్కి భరోసా..! “

“ అవును...నువ్వేదో రోజు ఊళ్ళో పెత్తనాలు సాగిస్తూంటావనుకునేదాన్ని గానీ, అందర్నీ పలకరించి, మంచీ చెడ్డా చూస్తుంటావని నాకిపుడు తెలుస్తోంది ! అందుకే కాబోలు...ఊళ్ళోవాళ్ళందరూ నిన్ను చూడగానే చేతులెత్తి దండాలు పెడతారు ! ఇపుడూ ఊళ్ళోకి బయలుదేరినట్లున్నావ్ గా...వచ్చేసరికి ఏ వేళ అవుతుందో..కొంచెం పాయసం తిని వెళ్ళిరా...”

“ పాయసమా...? తోచీ తోచనమ్మ తోడికోడలు పుట్టింటికి వెళ్ళినట్లు...పండుగ పబ్బమూ ఏమీ లేనపుడు పనిగట్టుకుని పాయసం ఎందుకు చేశావే..? “

“ మనవల కోసం ...ఆరాటపడుతున్నావుగా...అదీ..అదీ...ఆ కబురు చెప్పి నీ నోరు తీపి చేద్దామనీ...”

“ నిజమా...?! ఓసినీ ఇల్లు బంగారం కానూ...! ఇంత మంచి కబురును ముందుగా కదూ చెప్పాలీ..? నేతికుండను వెనకపెట్టి, ఉట్టి చట్టిని ముందు పెట్టినట్లు...ఆఖరునా ఈ కబురు చెప్పేదీ..! “

“ నేను ముందుగానే చెప్పాలనుకుని మొదలు పెట్టా. పిల్లలకి సుద్దులూ, బుద్దులూ నేర్పించటానికి నీతి కథలు గుర్తు చేసుకుందామని పుస్తకాలు తిరగేస్తున్నానని చెప్పబోతుంటే...నువ్వే టీచరమ్మ నవుదామనుకుంటున్నావా అని ఆట పట్టించావ్...! “

నిజమేనే...నేనే తెలుసుకోలేకపోయా...అమ్మా..మంగళా...ఈ కబురు విన్నాక నాకెంత అనందంగా వుందో ! ముందు మా అన్న నోరు తీపి చేసి ఈ మంచివార్త చెప్పి వస్తాను...ఆ తర్వాతనే ఈ చుట్టుపక్కల వాళ్ళందరికీనూ...! “

“ అలాగే...నీ సంగతి తెలుసుగా..నలుగురికీ పంచందే ఏదీ నీ నోటికి రుచించదని...! అందుకే గుండిగంత పెద్ద గిన్నె నిండా పాయసం చేసి పెట్టాలే !! “

- **గోగినేని మణి.**